# అల్లంత దూరాన
# దీపాల కళ్ళ మనిషి

పర్ణశాలకు అల్లంత దూరంలో లేమావి తోటలో ఎలమావి గున్నకు నీళ్ళుపోస్తూ చూస్తోంది తార! పదారు వన్నెల బంగారు ఛాయతో మిస మిస లాడుతున్నాడు ఆ కుర్రాడు. బృహస్పతిముందు చేతులొగ్గి ఏదో చెప్తున్నాడు. కాని తార మనసంతా ఆ కుర్రాడి సోయగం మీదే ఉంది.

"నా అంత వాడిని చేస్తా చంద్రా!" అంటున్న భర్తమాటలు విందామె ఒహో! తారా మనోహరుడా! అనుకుంది. చక్కని చోటికి వచ్చి చిక్కాల్సిన చోట చేతికే చిక్కుతున్నావులే! గురువుగారు అష్టాదశ విద్యలు నేర్పుతాడు.... నేను...." అనుకుంది తార. చంద్రుడు విద్యాభ్యాసం ప్రారంభించాడు. ఏళ్ళు గడిచాయి. మొక్కను ప్రేమతో పెంచి ఫలం ఆశించే విధంగా చంద్రుణ్ని పెంచింది తార.

యౌవనం వచ్చింది ఎండిపోయిన చెట్టుపై వసంతుడు దాడి చేస్తే నిలువెల్లా పూచినట్లు యౌవనావిర్భావంతో నిలువెల్ల అందమే నిండిపోయింది. తార గుండెలనిండా కోరికలు నిండాయి. అతన్ని చూస్తే కులుకుచూపుల చూడని మీనాక్షి లేదు. అతని పెదవులుచూసి అనురక్తిచెందని బింబాధరా కానరాదు. అతను భాషిస్తే పలుకరించని చిలుకలకొలికి లేదు. అతని ముఖం చూసి తమి చెంది, కందని కమలముఖి లేదు. నిలువెల్లా చూసి అతన్నల్లుకుపోవాలని ఆశపడని లతాంగి ఉండదు. ఏ ప్రమద చూసినా పారవశ్యం చెందాల్సిందే! ఏ హేమాంగి చూసినా మరుని కాకకులోను కావాలి! అబలలు చెంతచేరి దయ చూడమంటున్నారు! గజ గమనలు కేలెత్తి మొక్కుతున్నారు. అతని రూప యౌవన విలాస విభ్రమాలు చూసి తత్తర చెందని తరుణులే లేరంటే అది స్వభావోక్తి!

బయటవాళ్ళకే అలా ఉంటే-

ఇంట్లో ప్రతిక్షణం తిరుగాడుత్తూ తన నగ్న వక్షాన్ని విశాల బాహువుల్ని ప్రత్యక్ష పరుస్తోన్న చంద్రుడ్ని చూసిన తార-తాళలేకపోయింది. ఎలాగైనా ఇతడ్ని లొంగదీసుకోవాలి అనుకొంది. న్యాయం కాదేమో అనుకొని న్యాయాన్యాయాలు విచారిస్తే నిలువగలనా అని సరిపెట్టుకుంది.

మెల మెల్లగా అతని సమీపంలో తిరుగాడసాగింది. బృహస్పతి లేని సమయంతో చెంతచేరి రెప్పవేయకుండా చూస్తోంది. అతని దగ్గరగావెళ్లి ఓర పయట జారేట్లుచేసి చెంతచేరి భుజానికి తన మనోభూరుహాల్ని సోకిస్తోంది.

అల్లప్పుడు-బాపడా! చిన్ని కుమారా! రారా! బాబూ! అనిపిలిచేది. ఇప్పుడో ఓ సామి! ఓకాయజ మోహనాకార! వగకాడ! జాణా! అని నర్మోక్తులతో పిలుస్తోంది.

అమాయకం నటిస్తున్న చంద్రుడ్ని ఏకాంతానికి పిల్చి జిలుగుచీర విడిచి చెంగావిచీర కట్టుకుని ఏ చీరలో బావున్నాను అని అడుగుతోంది. జడ వదిలి కొప్పుకట్టి ఎలాఉంది అని అడుగుతోంది. అతన్ని దగ్గరికి పిలిచి ఒళ్ళు రాచుకునేలా నిలబడి నువ్వెత్తా నేనెత్తా అని ప్రశ్నిస్తుంది. ఎవరయినా చూస్తున్నారేమో అనే సిగ్గు కూడా ఉండదు.

చంద్రా! చంద్రా! ఇలారా! అద్దం లేదు! ఈ తిలకం ముఖాన దిద్దిపో అని పిలుస్తుంది. బుద్ధిగా వచ్చి తిలకం అతడు దిద్దితే పెదాలు కుదురు చేసి ముద్దిడుకో అన్నట్లు సమీపిస్తుంది. అతడు అమాయకుడిలా మౌనం వహిస్తే రుసరుసలాడుతుంది.

ఇక ఇదికాదని యిలారా! నీ తలకట్టు చిక్కుతీసి నున్నగా దువ్వుతా అని అతన్ని రప్పించుకుని తాను పీటమీద కూర్చుని అతని తలను తన గుండెలకుహత్తుకుంటూ చిక్కు తీస్తుంది! మాటామాటా కలిపి తటాలున బుగ్గగిల్లుతుంది. అయినా అతడు రమ్మనడంలేదు కిమ్మనడం లేదు.

ఓరోజు ఆదమరచి నిద్రిస్తుంటే తమకం ఆపుకోలేక అ లేతబుగ్గలు ముద్దుపెట్టుకుంది. చంద్రుడు నిద్ర లేచి లేవగానే అద్దంలో ఆముద్దు గుర్తులు

చూపించి ఎక్కడికి వెళ్లొచ్చావు? ఎవరిలా ముద్దాడారు? చెప్పు? గుట్టుగా చదువు కొమ్మని మీ వాళ్ళు పంపితే ఇలా రాయిడిలా రట్టు చేస్తున్నావా అని నిలదీసింది. పాపం నోరెత్తలేదు చంద్రుడు!

అలా అలా తార మితిమీరి రెచ్చగొడితే చంద్రుడిలో తొందర మొదలైంది. ఆలోచన అనంత శాస్త్రాలు వదిలి అనంగశాస్త్రం చుట్టూ తిరగసాగింది. ఆమె మోమును మోవిని హొయలను చూపును మెచ్చుకోసాగాడు లోకంలో ఎందరిని చూడలేదు! చందమామ ముఖంతో ఎందరున్నా ఈ అందచందాలు ఎవరికున్నాయి! నాలోనేమో కోరికలు ఎక్కుటమై పోతున్నాయి! ఇదేమో అందరాని ఫలమైంది! ఏం చెప్పవలె! అని మన్మథ వేదనకు లోనవుతున్నాడు. ఏవేదాలు ఏ శాస్త్రాలు ఏవాదాలు ఏవివేకం ఎలా నిలుస్తుంది అనుకుంటున్నాడు. శాస్త్రాలు శాస్త్రాలు అంటారేకానీ పొలయలుకలు ఈ పొలతుకతో తర్కించడం తర్కశాస్త్రం కాదా? అనంగ రంగకేళిలో ఈవిడతో కలిసి కళాస్వరాలు పలకడం స్వరశాస్త్రం కాదా! ఈమె మోమున మోము చేర్చడం యోగశాస్త్రం కాదా! ఈమె రతిక్రీడా గుణాలను లెక్కించడం సాంఖ్యశాస్త్రం కాదనగలరా! ఆవిడ నీవి వదిలించడం మోక్షశాస్త్రం అనలేమా! అంతేనా ద్వైతం అద్వైతం మా కలయికలో తేట తెల్లం కాదా! అని వింతవాదన చేస్తున్నాడు అంతరంగంలో

ఆమె చెక్కిలిమీద నొక్కులుంచడం గురుప్రతిష్ఠ సలపడంలా భావిస్తున్నాడు.

ఎన్ని విధాలా ఆలోచించినా కోరికతీరే తరుణం రావడంలేదు. తార రకరకాలుగా రెచ్చగొడుతోందేతప్ప దరిచేరి చేర్చుకొని విరహం దరిచేరేలా చేయడం లేదు. నిద్రించే కోరికలు రెచ్చగొట్టి వొళ్ళు సల సల కాగేలా చేస్తుంది తప్ప సరస శృంగార సీమకు స్వాగతం పలకడం లేదు.

ఎలా? ఎలా? ఎలా?

చంద్రుని కోరికలు పండేతరుణం వచ్చిందా అన్నట్లు బృహస్పతికి పిలుపువచ్చింది. యజ్ఞం చేయించడానికి అమరావతికి వెడుతూ రకరకాల నీతి బోధ చేసి చంద్రుని ప్రేమగా చూసుకొమ్మని చెప్పివెళ్లాడు.

ఇంక తార కోరికల తెర తొలగిందిఆపై........

—o—